క్లుప్తంగా

ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తికి చెందిన జయశ్రీ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి ద్వారా రూ.2.50 లక్షల మంజూరుకు సంబంధించి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) ఉత్తర్వు జారీ అయింది. శుక్రవారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన నివాసంలో ఎల్వోసీని జయశ్రీ తండ్రి రమేష్‌కు అందజేశారు.

'ఇక్రిశాట్' స్కూల్‌కు పవన్‌కల్యాణ్



ఇక్రిశాట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్‌కు వచ్చిన పవన్ కల్యాణ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణ పరిధిలోని ఇక్రిశాట్ ప్రాంగణంలోని ఇంటర్నేషనల్ పాఠశాలకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వచ్చారు. తనయుడు మార్క్ శంకర్‌కు అడ్మిషన్ కోసం స్కూల్ యాజమాన్యంతో మాట్లాడినట్లు తెలిసింది. ఈ సందర్భంగా రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పీసీసీ ఉపాధ్యక్షుడికి సన్మానం



సంగమేశ్వర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని మర్వెల్లి గ్రామానికి చెందిన మాజీ స్కోర్ చైర్మన్ పి.సంఘమేశ్వర్ ఇటీవల పీసీసీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్‌రావు, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శివచరణ్, పమేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, ఎన్‌ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు సీజ్



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ విజయరావు

పటాన్‌చెరు: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించినట్లు పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయరావు తెలిపారు. శుక్రవారం బీరంగూడ సమీపంలో పలు విద్యాసంస్థల బస్సుల తనిఖీ చేపట్టి రెండు బస్సులను సీజ్ చేశామని, మరో రెండింటికి జరిమానా విధించినట్లు చెప్పారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్

పటాన్‌చెరు టౌన్: అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మృతిచెందిన వారికి పటాన్‌చెరు కాంగ్రెస్ శ్రేణులు నివాళులర్పించారు. శుక్రవారం సాయంత్రం డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతీక్, కాంగ్రెస్ నాయకులు సాయిలు, యువరాజ్, అక్షిత్, శ్రీధర్, రాములు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని మురళీకృష్ణ దేవాలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూల మంత్ర హోమం, ప్రత్యేక హోమం, విష్ణుసహస్ర నామ పారాయణం, కుంకుమార్చన నిర్వహించారు.

పరిశ్రమలతో యువతకు ఉపాధి

ఎంపీ సురేష్‌శెట్కార్



జహీరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎంపీ షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): నిమ్జ్‌లో భాగంగా ఏర్పాటు కానున్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ సురేష్‌శెట్కార్ తెలిపారు. హద్నూర్‌లో శుక్రవారం రాత్రి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొత్త పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎంపీ సురేష్ శెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, టీజీఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ అహ్మద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డిలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

జహీరాబాద్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎంపీ సురేష్ శెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం జహీరాబాద్ మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కల్పించారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని సొంత ఇంటిని నిర్మించుకోవాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు నిరాధరణకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఐడీసీ మాజీ చైర్మన్ ఎండీ తన్వీర్, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి జి.శుక్లవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన అవసరం

జహీరాబాద్: పంటల సాగుపై అవగాహన అవసరమని ఎంపీ సురేష్ శెట్కార్ అన్నారు. శుక్రవారం కోహీర్ మండలం బిలాల్‌పూర్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులకు పంట సాగులో మెలకువలు, ఎరువుల యాజమాన్యం, విత్తనాల ఎంపిక, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంపీ శెట్కార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సకాలంలో పంటల సాగు, యాజమాన్యం పద్ధతులను పాటించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల పంట దిగుబడులను సాధించలేక పోతున్నారన్నారు. వీటిని అధిగమించి ఆశించిన మేర దిగుబడులు సాధించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం



నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఖేడ్‌కు చెందిన పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గాజుల్‌పాడ్ మీదుగా కంగ్టికి బస్సు నడపాలని కోరారు. తడ్కల్ నుంచి గాంధీనగర్, రాసోల్, కంగ్టిల మీదుగా సంగారెడ్డికి బస్సు నడపాలని జలీల్, కల్హేర్ మీదుగా పిట్లం వరకు బస్సు నడపాలని దేవీదాస్, కల్హేర్ మీదుగా నిజాంసాగర్‌కు ఉదయం, సాయంత్రం బస్సులు నడపాలని సంగమేశ్వర్ కోరారు. విద్యార్థుల కోసం అంతర్గాంకు స్కూల్ ట్రిప్పు బస్సు నడపాలని సిర్గాపూర్ ఎంఈఓ నాగారం శ్రీనివాస్ కోరారు. ఆయా సమస్యల్ని నమోదు చేసుకున్న డీఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు

నారాయణఖేడ్: భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఖేడ్ డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ తెలిపారు. మండలంలోని జగన్నాథ్‌పూర్‌లో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను భూ భారతి చట్టం ద్వారా వేగంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. సదస్సులో ఆర్ఐ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్హేర్ మండలంలో...

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మహదేవ్‌పల్లి, నిజాంపేట్ మండలం నాగధర్‌లో శుక్రవారం భూ భారతి సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లేశం, సిబ్బంది చేతక్, రవి, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

ఎమ్మెల్యే చింతాకు ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి వినతి



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి: సర్కారు భూమిని కాపాడాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ..సంగారెడ్డి పట్టణంలో సర్వే నంబర్ 374లోని ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు ఇళ్లు లేకున్నా ఉన్నట్లు అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి మున్సిపల్ కార్యాలయం నుంచి ఇంటి నంబర్లు తీసుకున్నారని వివరించారు. 59 జీవో కింద రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకుని కల్వకుంట సర్వే నంబర్ పేరుతో మున్సిపల్ నుంచి అనుమతులు పొంది సంగారెడ్డి సర్వే నంబర్ 374లో అక్రమ నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారుల కు ఫిర్యాదు చేసినా రాజకీయ నేతల ఒత్తిడితో చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

ఎంఈఓను సస్పెండ్ చేయాలి

- సమయపాలన పాటించడంలేదు
- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్



సదాశివపేట ఎంఈఓ కుర్చీకి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): సమయపాలన పాటించకుండా ప్రైవేట్ పాఠశాలలకు తొత్తుగా మారిన ఎంఈఓ శంకర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు వినతి పత్రం ఇవ్వడానికి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలైనా ఆయన కార్యాలయానికి రాకపోవడంతో ఎంఈఓ ఖాళీ కుర్చీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అనుమతులు లేకుండానే కొన్ని విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు దండుకొని అనుమతులున్నాయని ప్రచారం చేసి తల్లిదండ్రులను మోసం చేస్తుంటే ఎంఈఓ మాత్రం అటువైపు కన్నెత్తి చూడటంలేదన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ చేసి ఎంఈఓను విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖేడ్‌లో భారీ వర్షం



వర్షం వల్ల పట్టణంలోని జాతీయ రహదారిపై పారుతున్న వర్షపు నీరు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో అరగంట పాటు భారీ వర్షం కురిసింది. రెండు మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమైనప్పటికీ వర్షం కురవకపోవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో వ్యవసాయ పనులు చేసుకోవడానికి ఇబ్బందులకు గురయ్యారు. వర్షం వల్ల పట్టణంలోని రోడ్లపై వరద నీరు భారీగా ప్రవహించింది.

కల్హేర్ మండలంలో...

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో శుక్రవారం సాయంత్రం పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్హేర్, మార్డి, మాసాన్‌పల్లి, ఇందిరానగర్, కృష్ణాపూర్, తదితర చోట్ల వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పశువుల కాపరులు బిక్కుబిక్కుమంటూ ఇంటిబాట పట్టారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

నారాయణఖేడ్: పాఠశాలలు పునఃప్రారంభమైనందున మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఖేడ్ మండలం నమ్లిమేట్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని కేజీబీవీ పాఠశాలలో ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి దీపిక తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ నైట్ వాచ్‌మన్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు పదోతరగతి చదివిన మహిళలు అర్హులన్నారు. స్వీపర్, స్కావెంజర్ ఉద్యోగానికి ఏడో తరగతి విద్యార్హత ఉన్న మహిళలు అర్హులని, ఆసక్తి ఉన్న మహిళలు 14వ తేదీన తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

భూ భారతిలో సమస్యల పరిష్కారం

మునిపల్లి(అందోల్): తమ భూములకు సంబంధించిన సమస్యలుంటే భూ భారతి సదస్సుల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని మంజీర రైతు సమైఖ్య జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని మల్లారెడ్డిపేటలో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ మధన్‌మోహన్, ఆర్ఐ సుభాష్ పాల్గొన్నారు.

నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులతో బోధన

రాయికోడ్(అందోల్): ఔరంగానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మండల విద్యాధికారి మాణయ్య శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులతో అక్షరాలు రాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులు బోధిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

వ్యాధుల సీజన్‌లో అప్రమత్తంగా ఉండాలి

నారాయణఖేడ్: వర్షాకాలం వ్యాధుల సీజన్ కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 12వ రోజు శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 1, 8, 12వ వార్డుల్లో నిల్వఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేసి యాంటీ లార్వా పిచికారీ చేశారు. 11వ వార్డులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

నూతన విద్యార్థులకు అక్షరాభ్యాసం



విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ ఎండీ రహీమొద్దీన్

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగ్టిలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. శ్రీవిద్యా సరస్వతి మాతా చిత్రపటానికి పూజలు చేసి అనంతరం విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించినట్లు ఎంఈఓ ఎండీ రహీమొద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యశ్వంత్ రాథోడ్, ఉపాధ్యాయులు కిఫాయత్‌అలీ, విశ్రాంత ఉపాధ్యాయులు నాగ్‌నాథ్‌సార్, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు



గదిని సీజ్ చేస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: విద్యాశాఖ అనుమతులు లేకుండా స్కూలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎంఈఓ నాగేశ్వర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రారంలో అనుమతి లేకుండా పాఠశాల నిర్వహణకు విద్యార్థులు నుంచి అడ్మిషన్ తీసుకున్నందున పాఠశాలను గదిని సీజ్ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. గ్రామంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారని, అదే క్యాంపస్‌లో అనుమతి లేకుండా స్కూల్ నిర్వహించేందుకు దాదాపు 245 మంది విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారని తెలిపారు. డీఈఓ ఆదేశాలు జారీ చేయడంతో సందర్శించి, పరిశీలించామన్నారు. అయితే విద్యార్థులను స్కూల్‌లో చేర్పించేందుకు వచ్చిన తల్లిదండ్రులతో కూడా మాట్లాడమని తెలిపారు. నోటీసులు జారీ చేసి అడ్మిషన్ ప్రక్రియ జరుగుతున్న గదిని సీజ్ చేశామని చెప్పారు.

సోయాబిన్ విత్తనాల పంపిణీ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సోయాబిన్ విత్తనాలను పంపిణీ చేశారు. మండలంలోని రంజోల్, మొగుడంపల్లి మండలం మన్నాపూర్ రైతు వేదికల్లో ఆయా గ్రామాల రైతులకు ఆదిలాబాద్ వారి ఏఎస్‌బీ 101, ఏఎస్‌బీ 185, రుద్రుర్ ఆర్ఎస్‌బీ 5 రకం విత్తనాలను పంపిణీ చేశారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి



డీఈఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి, పాఠశాలలను బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి కోరారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మే 25 నుంచి 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 28 మండలాల్లో 136 గ్రామాలలో బడి బాటలో భాగంగా ఎన్‌రోల్‌మెంట్ ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, కమ్యూనిటీ నుండి వచ్చిన సూచనలు , సమస్యలు తెలుపుతూ శుక్రవారం డీఈఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాయిలు, కోశాధికారి శ్రీనివాసరావు కార్యదర్శి సాయితేజ, సింహాచలం నాయకులు రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బోరు మోటారు ప్రారంభం

మునిపల్లి(అందోల్): గ్రామంలోని ప్రజలకు తాగునీటి సౌకర్యం కోసం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో బోరు మోటారు ఏర్పాటు చేసినట్లు రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేశ్ కురుమ తెలిపారు. మండలంలోని మల్లికార్జునపల్లిలో శుక్రవారం బోరు మోటారును ప్రారంభించిన తాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తులసి, మాజీ ఉపసర్పంచ్ విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విష్ణు, గురివి తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు టౌన్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐనోల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11: 30 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంద్రేశం ఫీడర్ పరిధిలో ఉదయం 11: 30 గంటల నుంచి 12 గంటల వరకు, పటేల్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కిష్టారెడ్డిపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ మునిపల్లిలో బడిబాట

మునిపల్లి(అందోల్): మండలంలోని మునిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చిన 15 మంది విద్యార్థులను బడిలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అశోక్ కుమార్, ఉపాధ్యాయులు మధురిమ, కవిత, చంద్రమౌళి, బుష్రా అమ్రిన్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ ఏకరూప దుస్తుల పంపిణీ

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఏక రూప దుస్తులు పంపిణీ చేయడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కంగ్టి ప్రాథమిక పాఠశాలలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రహీమొద్దీన్, ప్రధానోపాధ్యాయులు యశ్వంత్ రాథోడ్, ఉపాధ్యాయులు కిఫాయత్‌అలీ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు గంగాధర్, విశ్రాంత ఉపాధ్యాయులు పట్నే నాగ్‌నాథ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ సామూహిక అక్షరాభ్యాసం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్, జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, నాయకులు వడ్డే నరసింహులు పాల్గొన్నారు. అలాగే రామచంద్రాపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప పాల్గొన్నారు.

◆ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాయబ్ తహసీల్దార్ బాలరాజ్ కోరారు. మండలంలోని కొల్కూర్ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

◆ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓ శంకర్ కోరారు. మండలంలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని వారితోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. పిల్లలకు ఉచితంగా దుస్తులు, పాఠ్య పుస్తకాలను అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ భగీరథ పైపులైన్ లీకేజీ

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో తాగు నీరు వృథాగా పోతోంది. మండల పరిధిలోని చీలమామిడి గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పైపులైన్ లీకేజీ కావడంతో రహదారి అంతా చిత్తడిగా మారింది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు మిషన్ భగీరథ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు.

◆ పేదల సొంతింటి కల సాకారం

జిన్నారం(పటాన్‌చెరు): నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని పటాన్‌చెరు ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లిలో లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు.

◆ ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

పటాన్‌చెరు టౌన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని నవభారత్ నిర్మాణ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ కోరారు. ఈమేరకు శుక్రవారం ఎంఈఓ నాగేశ్వరరావు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

◆ సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శశికాంత్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందడంతో శుక్రవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరాం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. .

◆ విద్యతోనే గుర్తింపు

సదాశివపేట(సంగారెడ్డి): చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని భవిత కళాశాల ప్రిన్సిపాల్ బాలరాజు పేర్కొన్నారు. పట్టణంలోని ట్రెండ్స్ యజమాన్యం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. వారికి సర్టిఫికెట్స్, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో భవిత కళాశాల డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, రాజు, అధ్యాపకులు రవి, వీరన్నచారి, విద్యార్థులు పాల్గొన్నారు.